సాక్షి
రంగారెడ్డి
సోమవారం ; 9 ; జూన్ ; 2025



అనువైన సమయమిదే ..

మొక్కజొన్న సాగుకు అనువైన సమయం ఇదేనని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 8లో▸



పహాడీషరీఫ్: జల్‌పల్లి చెరువు వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న జనం

మీనం.. ఘనం

మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం చేపలకు భలే డిమాండ్ ఏర్పడింది. కార్తె ప్రారంభమైన రోజు చేపలను ఆరగించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో జిల్లాలో విక్రయాలు జోరుగా సాగాయి. ఇదే అదునుగా వ్యాపారులు ధర అమాంతం పెంచేశారు. సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు పలికినా కొనేందుకు జనం ఆసక్తి చూపారు. మార్కెట్లలో ఎటు చూసినా సందడి కనిపించింది.



కందుకూరు: చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

న్యూస్‌రీల్

నేటి నుంచి ట్రాఫిక్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ కేసులకు సంబంధించి సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఆరు రోజుల పాటు చేవెళ్ల కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిల, షాబాద్ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసులు ఏమైనా పెండింగ్‌లో ఉంటే పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు, లైసెన్స్‌లు లేకుండా, ట్రిపుల్ రైడింగ్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మరకత శివాలయం సందర్శన



ఆలయంలో పూజలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ రాధా దంపతులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని ఆదివారం జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ రాధా సతీష్ దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జాయింట్ కమిషనర్‌కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరకత శివాలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. గతంలో శంకర్‌పల్లి మండలంలో నాలుగేళ్లు పని చేశానని అప్పుడు సైతం దర్శించుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మైసమ్మ సన్నిధిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కష్టపడే కార్యకర్తలు, నాయకులను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగ లక్ష్మీకాంత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ధళపతిగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామంలో పిరమిడ్ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మాంసాహారం అనేక ఆరోగ్య సమస్యలకు మూల కారణమని అన్నారు. మానవుడి శరీరం శాకాహారం మాత్రమే తినడానికి నిర్మితమై ఉందన్నారు. అహింసో పరమో ధర్మ.. జీవహింస మహాపాపం.. మాంసాహారం వద్దు శాకాహారం ముద్దు అన్నారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ ఆశయాలైన అహింసా మార్గంలో జీవిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, నవీన్, కవిత, శంకర్, సురేష్, నవీన్, లావణ్య, బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుమ, శైలజ, జ్యోతి, జంగయ్య, పద్మ, ప్రవీణ్, యాదగిరి, వేణు, సురేష్‌రెడ్డి, హరిలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సందడిగా బోనాల ఊరేగింపు

బోనం.. వైభవం

యాచారం మండలం తమ్మలోనిగూడలో ఆదివారం బీరప్ప బోనాలు ఘనంగా జరిగాయి. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– యాచారం



పోతురాజుల నృత్యాలు

ఛ్చ్.. మళ్లీ నిరాశే!

మంత్రివర్గ విస్తరణలో రిక్త'హస్తం'

- గ్రేటర్ నేతలకు దక్కని చోటు
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి
- నారాజ్‌లో నేతలు, కేడర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గ్రేటర్ నేతలకు మళ్లీ నిరాశే మిల్చింది. ఎవరో ఒకరికి మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని అంతా ఆశించారు. కానీ ఆదివారం చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో అవకాశం దక్కకపోవడంతో అంతా నారాజ్‌లో ఉన్నారు. ఉమ్మడి ఏపీలో సైతం గ్రేటర్ జిల్లాలకు సముచిత స్థానం కల్పించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోనూ ఐదుగురు మంత్రులకు ప్రాతినిధ్యం దక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన మొదటి మంత్రివర్గంలోనే కాదు తాజాగా చేపట్టిన రెండో విస్తరణలోనూ ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడాన్ని కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యవహరిస్తున్నారు.

ఆ నేతలందరికీ భంగపాటే..

గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకోగా, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ సహా పరిగి, తాండూరు, కొడంగల్‌లోనూ కాంగ్రెస్ హవా కొనసాగించింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగా, వికారాబాద్ నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే నియోజకవర్గం అభివృద్ధికి భారీ నిధుల కేటాయింపు, మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పిస్తుందనే ఆశతో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. తీరా కారు దిగి హస్తం గూటికి చేరుకున్న తర్వాత ఎమ్మెల్యేల పార్టీ మార్పు అంశం సుప్రీంకోర్టుకు చేరడం తెలిసిందే. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వారికి మంత్రి వర్గంలో స్థానం లభించకపోగా పార్టీలోనూ తగిన గుర్తింపు లేకపోవడంతో వారు ఒంటరయ్యారు. పార్టీ మారిన వారితో పాటు మొదటి నుంచీ పార్టీనే నమ్ముకున్న వాళ్లకు కూడా మంత్రి వర్గంలో స్థానం లభించలేదు.




మల్‌రెడ్డితో సమావేశమైన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం తదితరులు

అలకపాన్పుపై మల్‌రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో మొదటి నుంచీ మంత్రి పదవిని ఆశిస్తున్న వారిలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముందు వరుసలో ఉన్నారు. మంత్రివర్గంలో తనకు అవకాశం ఇచ్చి జిల్లాకు సముచిత స్థానం కల్పించాల్సిందిగా కోరుతూ వస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవల జిల్లా నేతలతో వెళ్లి ఢిల్లీ పెద్దలను కూడా కలిశారు. అయినా తాజా మంత్రివర్గ విస్తరణలోనూ అవకాశం దక్కక పోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా అధిష్టానం పెద్దలపై ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. మంత్రి పదవికి తన సామాజికవర్గమే అడ్డంకిగా భావిస్తే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ఇప్పటికే స్పష్టం చేశారు. తన స్థానంలో మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నిలబెట్టి ఎమ్మెల్యేగా గెలిపిస్తామని, కనీసం ఆయనకైనా మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా నేతలతో సమావేశమై ఏకాభిప్రాయం సాధించారు. ఇదే అంశాన్ని అధిష్టానం పెద్దలకు వివరించారు. ఒకానొక దశలో జిల్లా నేతలంతా ఏకవాక్య తీర్మానం కూడా చేసి పంపారు. అయినా ఆయనకు మంత్రి వర్గంలో స్థానం దక్కలేదు. దీంతో మల్‌రెడ్డి అలకపాన్పు ఎక్కారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సహా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారి సూచన మేరకే మీడియా సమావేశాన్ని సైతం రద్దు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మీర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సీపీఐ పని చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. లెనిన్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ 6వ మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారితో కలిసి జంగయ్య హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజంలో తీవ్ర అసమానతలు పెరిగిపోతున్నాయని, అసమానతలు లేని సమాజం కష్టజీవుల శ్రామికుల సమాజం ఎర్రజెండా ద్వారానే సాధ్యమని అన్నారు. దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం అలుపెరుగని పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మావోయిస్టులను వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ బాలాపూర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా జటోత్ రెడ్యానాయక్, కౌన్సిల్ సభ్యులుగా పిచ్చిరాజు, డేరంగుల శంకరయ్య, జాజుల అంజయ్య, శివ, బండ యాదమ్మ, రమాపాండునాయక్, ఛత్రునాయక్, వీరాస్వామి, కౌసల్య, దేవయ్య, రమేష్, మిరియాల లక్ష్మమ్మ, పద్మ ఎన్నికయ్యారు.

ఆన్‌లైన్ ద్వారా మరిన్ని సేవలు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల సదుపాయార్థం జీహెచ్‌ఎంసీలో మరిన్ని సేవల్ని ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెచ్చామని, నగర పౌరులు వాటిని వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. ఆస్తిపన్ను సెల్ఫ్ అసెస్‌మెంట్‌తో పాటు ఆస్తి పన్ను సవరణ, మొబైల్ నెంబర్ అప్‌డేషన్, ఇంటి నెంబరు సవరణ, భవన యజమాని పేరు సవరణ వంటి సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రజలు తామున్న చోటు నుంచే ఆన్‌లైన్ ద్వారా వీటిని పొందవచ్చన్నారు. వీటి కోసం సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, అధికారులు పరిశీలించి ఆమోదిస్తారని తెలిపారు. త్వరలోనే మ్యుటేషన్ సేవలు కూడా సులభంగా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తేనున్నట్లు కర్ణన్ పేర్కొన్నారు.

అంతా తప్పుల తడక

- మున్సిపల్ ఓటరు జాబితాలో అన్నీ పొరపాట్లే..
- ఒకే వ్యక్తి ఓటు రెండు మూడుసార్లు
- జాబితాలో చిన్నపిల్లల ఫొటోలు
- మున్సిపల్ పరిధిలో లేనివారు సైతం ప్రత్యక్షం



ఓటరు జాబితాలో యువతికి బదులు చిన్నారి ఫొటో

మొయినాబాద్: మున్సిపాలిటీ ఓటరు జాబితా తప్పుల తడకగా మారింది. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాలో అన్నీ తప్పులే దర్శనమిస్తున్నాయి. ఒకే వ్యక్తి ఓటు రెండు మూడు సార్లు ఉండటంతోపాటు చిన్న పిల్లల ఫొటోలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో లేనివారి ఓట్లు సైతం జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. ఈ నెల 3న మున్సిపల్ అధికారులు వార్డుల విభజన చేపట్టి ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. ఐదు నెలల క్రితం కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో తొమ్మిది పంచాయతీలు విలీనమయ్యాయి. మొయినాబాద్, సురంగల్, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, అప్పోజీగూడ, పెద్ద మంగళారం గ్రామ పంచాయతీలు మున్సిపల్‌గా మారాయి. మున్సిపల్ పరిధిలో మొత్తం 32 వేల ఓట్లు ఉండగా 26 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డుకు 1,200 నుంచి 1,300 మంది ఓటర్లు ఉండేలా విభజించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేపట్టారు.

ప్రతి వార్డులో అదే పరిస్థితి

మున్సిపల్ అధికారులు విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో చాలా వరకు తప్పులే ఉన్నాయి. కొన్ని వార్డుల్లో ఒక్కొక్కరికి రెండు మూడు ఓట్లు ఉన్నాయి. ఒకే జాబితాలో ఒకే రకమైన పేరు, ఫొటోతో రెండు మూడు ఓట్లు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. 11వ వార్డుకు సంబంధించిన ఓటరు జాబితాలో 22 ఏళ్ల కుశల అనే ఓటరు స్థానంలో చిన్నపాప ఫొటో ఉంది. 25వ వార్డు ఓటరు జాబితాలో మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ దారెడ్డి శోభ పేరు, ఫొటోతో ఉంది. మరణించిన వారి పేర్లు, పెళ్లి చేసుకుని వెళ్లినవారి పేర్లు సైతం ఓటరు జాబితాలో ఉన్నాయి. ఇలా ప్రతి వార్డులో రిపీట్ అయిన ఓట్లు, ఇతర ప్రాంతాలకు చెందినవారి ఓట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. మున్సిపల్ అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉండటంపై పలు రాజకీయ పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందినవారి పేర్లు మున్సిపల్ ఓటరు జాబితాలో ఎలా ఉంటాయని.. అలాంటి వాటిని గుర్తించి అధికారులే తొలగించాలని.. తప్పులను సైతం సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను వివరణ కోరగా తమకు పై నుంచి వచ్చిన జాబితా విడుదల చేశామని.. తాము ఎలాంటి సవరణలు చేసే అవకాశం లేదన్నారు. తప్పులేమైనా ఉంటే తహసీల్దార్ వద్దగానీ, ఆన్‌లైన్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంచెలంచెలుగా..

- నగరం నుంచి ఎదిగిన మాగంటి గోపీనాథ్
- ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి..
- జూబ్లీహిల్స్ నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా..
- నియోజక వర్గంలో విషాదఛాయలు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజకీయాల్లో ఆయన అంచెలంచెలుగా ఎదిగిన విధానాన్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ మీద అభిమానంతో మాగంటి గోపీనాథ్ 1983లో టీడీపీ ద్వారా రాజకీయాల్లో ప్రవేశించారు. కొద్ది కాలానికే ఎన్టీఆర్ ఆశీస్సులతో రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, 1987 నుంచి 1988 వరకు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా, 1988 నుంచి 1993 వరకు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా పని చేశారు. 1963 జూన్ 2న హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో జన్మించిన మాగంటి గోపీనాథ్.. ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ పూర్తి చేశారు.

పార్టీల జిల్లా అధ్యక్షుడిగా...

టీడీపీలో ఉండగానే తొలుత 2014లో జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2018, 2023 ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో శాసనసభలో పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ (పీఈసీ) సభ్యుడిగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరడానికి ముందు గోపీనాథ్ హైదరాబాద్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో సైతం 2022 నుంచి పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నగరంలో ఎందరో నేతలున్నప్పటికీ, కేసీఆర్ ఆయనకే పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించారంటే ఆయనకు ఎంతటి ప్రాధాన్యమిచ్చారో అంచనా వేసుకోవచ్చు.

సినీ నిర్మాతగా..

మాగంటి గోపీనాథ్ రాజకీయాల్లో మాత్రమే కాకుండా సినీ నిర్మాతగానూ గుర్తింపు పొందారు. పాత బస్తీ (1995), రవన్న (2000), భద్రాద్రి రాముడు (2004,) నా స్టైలే వేరు (2009) సినిమాలను నిర్మించారు.

బుల్లెట్ వాహనాలతో ర్యాలీలు

బుల్లెట్ బండ్లతో ర్యాలీలు నిర్వహించడం ద్వారా మాగంటి తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్నారు. 1984లో ఎన్టీఆర్‌ను సీఎం పదవి నుంచి దించినప్పుడు, అనంతరం 1985లో ఎన్టీఆర్ తిరిగి సీఎంగా ప్రమాణం చేసినప్పుడు బుల్లెట్ ర్యాలీలు నిర్వహించారు. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ కార్యక్రమాలప్పుడు విభిన్న ప్రచారాలతోనూ ప్రత్యేకంగా నిలిచారు. ఆయా సందర్భాల్లో తెలంగాణ భవన్ వద్ద కేసీఆర్, కేటీఆర్‌ల కటౌట్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రముఖ క్రికెటర్ అజహరుద్దీన్‌పై గెలిచారు.

ఇక్కడే పుట్టి.. ఇక్కడే ఎదిగి

గోపీనాథ్ 1963, జూన్ 2న జన్మించారు. 1980లో వెంకటేశ్వర ట్యుటోరియల్స్ నుంచి ఇంటర్మీడియట్, 1983లో ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఆయనకు భార్య సునీత, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సిటీలో మరో ఉప ఎన్నిక!

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో నగరంలో మరో ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన లాస్య నందిత 2024 ఫిబ్రవరి 23న కారు ప్రమాదంతో మృతి చెందడంతో మే నెలలో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన లాస్య నందిత సోదరి నివేదితకు ఓటమి ఎదురైంది. సీనియర్ నాయకుడు జి.సాయన్న మరణంతో ఆయన వారసురాలిగా లాస్యనందిత రాజకీయాల్లోకి రావడం తెలిసిందే. ఆమె మరణంతో మేలో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన నారాయణ్ శ్రీగణేశ్ గెలిచారు. తాజాగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో మళ్లీ ఉప ఎన్నిక జరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయ్యాక ఆర్నెళ్ల లోపు ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగాక రెండేళ్లలోపునే రెండు ఉప ఎన్నికలు.. హైదరాబాద్‌లోనే కాదు.. బహుశా ఏ జిల్లాలోనూ జరిగి ఉండవు.



అంతిమయాత్రలో పార్టీ నేతలు, అభిమానులు

అన్నం పెట్టి.. ఆశ్రయం ఇచ్చి..

- యువతిపై లైంగికదాడికి యత్నం
- నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్: రోడ్డు పక్కన ఒంటరిగా నిలబడిని యువతిని లిఫ్ట్ ఇస్తానని బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లి అన్నం పెట్టి ఆశ్రయం ఇచ్చి అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మహారాష్ట్రకు చెందిన యువతి(22) ఇష్టం లేని పెళ్లి చేస్తుడటంతో ఇంటి నుంచి పారిపోయి హైదరాబాద్ చేరుకుని. శనివారం రాత్రి ఆమె జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి సమీపంలో ఒంటరిగా నిలుచుని ఉండగా అదే సమయంలో బైక్‌పై వస్తున్న మల్లికార్జునరెడ్డి అనే వ్యక్తి అమెను మాటల్లో పెట్టి ఆశ్రయమిస్తానని చెప్పి కమలాపురి కాలనీలోని తన గదికి తీసుకెళ్లాడు. ఆమెకు అన్నం పెట్టి ఆకలితీర్చాడు. ఆ తర్వాత ఆమెపై లైంగిక దాడికి యత్నించగా ఆమె కేకలు వేసింది. దీంతో పక్కఫ్లాట్‌లో నివసిస్తున్న వ్యక్తి అక్కడికి వచ్చి ఆరా తీయగా ఆమె జరిగిన విషయం చెప్పింది. దీంతో అతను డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మల్లికార్జునరెడ్డి గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన వ్యక్తికాగా, ఓ కొరియోగ్రాఫర్ వద్ద అసిస్టెంట్‌గా పని చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసుల సమాచారంతో నగరానికి చేరుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు ఆమెను తీసుకెళ్లారు. బంజాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ గోధుమల పట్టివేత

బంజారాహిల్స్: లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ గోధుమలు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించడానికి నిల్వ చేసిన గోదాములపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. భారీగా గోధుమలను స్వాధీనం చేసుకుని రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. బోరబండకు చెందిన బాబర్.. కొంతకాలంగా కార్డుదారుల నుంచి కిలో రూ.10 చొప్పున గోధుమలు కొనుగోలు చేస్తున్నాడు. వీటిని కర్ణాటకు చెందిన జితేందర్ రాథోడ్ అనే వ్యక్తికి కిలో రూ.12 చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బాబర్ గోధుమలు నిల్వ చేసిన గోదాముపై దాడి చేసిన పోలీసులు 7.5 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సర్కిల్–7 రేషనింగ్ అధికారులకు అప్పగించగా అధికారులు మూసాపేటలోని గోడౌన్‌కు తరలించారు. జితేందర్‌రాథోడ్‌పై గతంలోనూ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో రేషన్ గోధుమలు అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లుగా కేసు నమోదై ఉండగా పరారీలో ఉన్నాడు. సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లోనూ అతడిపై ఇదే తరహా కేసు నమోదై ఉంది. నిందితులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువత దేశ రక్షణకు కృషి చేయాలి

తాండూరు టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తితో యువత దేశ రక్షణకు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. హిందూ కాలమానం ప్రకారం జ్యేష్ఠ శుద్ధత్రయోదశి రోజున శివాజీ మహరాజ్‌కు పట్టాభిషేకం నిర్వహించారు. శివాజీ యువజన సంఘం,శివాజీగణేశ్ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారంహిందూసామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాజీ చౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలవేసినివాళులర్పించారు.సీనియర్ న్యాయవాది మనోహర్ రావు, శివాజీ యువజన సంఘం, గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు పూజారి పాండు, కృష్ణ ముదిరాజ్, దొరశెట్టి సత్యమూర్తి, కేశవరావు, రాంబ్రహ్మం, రామకృష్ణ, స్వామి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు అనువైన సమయమిదే


నవాబుపేటలో సాగు చేసిన మొక్కజొన్న పంట (ఫైల్)

నల్ల రేగడి, ఎర్ర నేలలు అనుకూలం

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు
- నవాబుపేట ఏఓ జ్యోతి



నవాబుపేట: మొక్కజొన్న సాగుకు అనువైన సమయమిదేనని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు ప్రస్తుతం ఈ పంట సాగులో బిజీగా ఉన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మంచి లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచిస్తున్నారు. నవాబుపేట మండలంలో ఈ ఖరీఫ్‌లో 27,234 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయలు తదితర పంటలు సాగుకానున్నాయి. అందులో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగనుందని అధికారులు తెలుపుతున్నారు. గతేడాది మండలంలో 744 ఎకరాల్లో సాగయింది. ఈసారి మాత్రం 2317 ఎకరాలకు పెరగనుందని అంచనా. మొక్కజొన్న సాగులో పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై అధికారులు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

నేలలు

సారవంతమైన నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు భూములు, నీరు నిల్వ ఉండేవి ఈ పంటకు అనుకూలించవు. విత్తుటకు ముందు మూడు–నాలుగు సార్లు నాగలితో దుక్కి దున్నాలి. ఎకరాకు దాదాపు 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.

విత్తేకాలం

సాధారణ పరిస్థితుల్లో వర్షాధారపు పంటను జూన్ 15 నుంచి జులై 15 వరకు విత్తుకోవచ్చు. రబీలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 లోగా విత్తితే ఎక్కువ దిగుబడులు పొందడానికి అవకాశం ఉంది. మొదలు నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి 1/3 వంతు ఎత్తులో విత్తితే నీటి పారుదల సులభంగా ఉండడమే కాకుండా వర్షాపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది.

కలుపు యాజమాన్యం

పంట విత్తిన తర్వాత రెండు, మూడు రోజులలోపు అట్రజిన్ అనే కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రాములు పిచికారీ చేయాలి. బరువు నేలలో అయితే ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల కొన్ని గడ్డిజాతి కలుపు మొక్కలను ఒక నెల వరకు అదుపు చేయవచ్చు. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు గమనిస్తే 2, 4–డి సోడియం సాల్ట్ ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది.

నీటి తడులు

మొక్కజొన్న పూతకు ముందు, పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో బాగా నీరు పెట్టడం అవసరం. 30–40 రోజులలోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానికరం. విత్తిన తర్వాత చేనులో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు. సాధారణంగా పంట కాలంలో 6–8 నీటి తడులు అవసరం. విత్తనాలు వేసినప్పుడు, విత్తిన 15 రోజులకు, తదితర దశల్లో నీటి తడులను తప్పకుండా ఇచ్చేలా జాగ్రత్త పడాలి. దీర్ఘకాలిక వంగడాలను 1–2 తడులు అధికంగా అవసరమవుతాయి.

తుప్ప తెగులు

ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల మాదిరిగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగిన కొద్ది ఆకులపైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. ఉధ్భతి, వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. పై రెండు రకాల తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండుసార్లు పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగులు

ఇవి రెండు రకాలు. మచ్చల, చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా రబీలో ప్రభావం చూపుతుంది. ఇవి పైరు మొలకెత్తిన 10–20 రోజులకు సోకుతాయి. పిల్ల పురుగులు మొదట ఆకులపైన పత్ర హరితాన్ని గోకి తింటాయి. తర్వాత గుండు సూది మాదిరి రంధ్రాలు, పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కలిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల పువ్వు చనిపోయి ఎండిపోతుంది. దీనినే డెడ్‌హార్ట్ అంటారు. కాండం లోపల గుండ్రని లేదా ఎస్ ఆకారంలో సొరంగాలను ఏర్పరుస్తుంది. ఇవి పూతను, కంకిణి ఆశించడంతో దిగుబడి తగ్గుతుంది.

రసం పీల్చు పురుగులు

30 రోజులు పైబడిన పైరును పేనుబంక, చిగురు నల్లి ఆశించవచ్చు. పొడి వాతావరణంలో వీటి ఉధ్భతి ఎక్కువగా ఉంటుంది. లేత కాండం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క గిడసబారిపోతుంది. ఇవి విసర్జించే జిగుఃటు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి మసి తెగులు ఆశించడం వల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నివారణ

సహజంగా అక్షింతల పురుగులు, సిర్ఫిడ్స్ వంటి పరాన్నజీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చు పురుగుల ఉధ్భతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మి.లీ లేదా డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

టర్సికమ్ ఆకు తెగులు

ఆకులపై పొడవైన, కోలాకారపు బూడిద రంగుతో ఆకుపచ్చ, గోధుమ వర్ణపు మచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు 2.5 నుంచి 25 సెం.మీ. పొడవు, 4 సెం.మీ. వెడల్పు ఉంటాయి. ఈ మచ్చలు మొదట మొక్క కింద ఆకులపై కనిపించి, క్రమంగా పెద్దవై వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చలిపోయినట్లుగా కనిపిస్తాయి. ఆకుల అడుగు బాగాన వలయాలుగా ఉంచాయి. ఈ మచ్చలు కాండంపైనా వ్యాపిస్తాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శివరాజ్(ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడ్తాల్ గ్రామానికి చెందిన కడారి శివరాజ్(66), గత నెల 27న యాక్టివ వాహనంపై మండల పరిధి కొత్తూరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో శ్రీశైలం రహదారి కొత్తూరు గేట్ వద్ద కందుకూరు వైపు నుంచి వేగంగా వచ్చిన పల్సర్ వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తిని.. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాశ విడిచాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జీడిమెట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిరన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్ పాండుబస్తీకి చెందిన రంగంపేట వినయ్(18)కి చిన్నతనంలోనే తండ్రి మృతిచెందాడు. అప్పటి నుంచి అతడి తల్లి మణి వినయ్‌తో పాటు అతని చెల్లిని పోషిస్తోంది. ఇటీవలే ఇంటర్ వినయ్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన అతను తన చదుల ఖర్చు కోసం టీజీఐఐసి కాలనీలోని జేవీసీ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పరిశ్రమలో పరిచయమైన విష్ణు అనే వ్యక్తితో కలిసి ట్యాంక్ బండ్‌కు వెళ్లేందుకు సాయిబాబానగర్ నుండి స్కూటీపై బయలుదేరాడు. వినయ్ స్కూటీ నడుపుతుండగా విష్ణు వెనకాల కూర్చున్నాడు. వీరి బైక్ లక్సాయ్ పరిశ్రమ వద్దకు చేరుకోగానే అదే సమయంలో సూరారం వైపు వెళ్లేందుకు యూటర్న్ ఓ లారీ యూటర్న్ తీసుకుంటుంది. అదే రోడ్డులో వస్తున్న వినయ్ అదుపు తప్పి లారీ వెనక టైరును ఢీకొట్టడంతో అతను వెనకటైరు కింద పడిపోగా వెనక కూర్చున్న విష్ణు పక్కకు పడిపోయాడు. ఈ ఘటనలో వినయ్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికిఅక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి మణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు.

విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల అరెస్టు

అంబర్‌పేట: గుట్టు చప్పుడు కాకుండా విద్యుత్ కేబుల్ వైర్లను చోరీ చేసి విక్రయిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణ యాజమానిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదివారం అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాగ్‌అంబర్‌పేటకు చెందిన నరేందర్, వీరు విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట హెల్పర్లుగా పని చేస్తున్నారు. వీరు శనివారం రాత్రి బతుకమ్మకుంటలోని ఓ స్క్రాప్ దుకాణంలో విద్యుత్ అల్యూమినియం వైర్లు విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపుపులోకి తీసుకుని ప్రశ్నించారు. స్క్రాప్ దుకాణం నిర్వాహకుడు చంద్రశేఖర్‌కు వైర్లను విక్రయించేందుకు వచ్చినట్లు చెప్పారు. వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. వారి నుంచి రూ.1.50 లక్షలు విలువైన విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి వర్గంలో బీసీలకు పెద్దపీట


వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న బాలరాజు గౌడ్, విజయకుమార్ గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో బీసీలకు పెద్ద పీట వేసిందని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టే విజయకుమార్‌గౌడ్ అన్నారు. 2వ విడత మంత్రి వర్గ విస్తరణలో బీసీ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. ఆదివారం శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించినందుకు పార్టీ అధినేత రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్ కొత్వాల్ పాల్గొన్నారు.

10న హిందీ ప్రచార సభ 90 వసంతాల వేడుక


వివరాలు వెల్లడిస్తున్న గైబువల్లి, ప్రొ.చంద్రదేవ్ కావడే

హిమాయత్‌నగర్: తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ 90 వార్షికోత్సవ వేడుకలను ఈనెల 10న జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్లు హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి గైబువల్లి తెలిపారు. ఆదివారం అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడేతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, సెంట్రల్ హిందీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబురావు కులకర్ణి తదితరులు హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి హిందీ సేవా ప్రతిభా పురస్కారాలు, పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలినారు. హిందీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, హిందీ భాషాభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేష్ పురి, కోశాధికారి గిరిధర్ రావు, స్పెషల్ ఆఫీసర్ శృతి కాంత్ భారతి, డాక్టర్ సుష్మా దేవి, రామచందర్, కార్యదర్శి ఏకే రాజు, విభా వెంకటేశ్వర్లు, నామ్‌దేవ్ వాగ్మాడే, శివలింగం గౌడ్, మాయ పాండే తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భధారణపై జాతీయ సదస్సు


సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ పవన్ గోరుకంటి తదితరులు

మాదాపూర్: యశోద హాస్పిటల్స్–హైటెక్‌సిటీ ప్రసూతి, గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో హైరిస్క్ గర్భధారణపై ఆదివారం జాతీయ స్థాయి సదస్సు, లైవ్‌వర్క్‌షాప్ నిర్వహించారు. 500మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఈ సదస్సులో విభిన్న వైద్య విభాగాల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ నూతన మార్గదర్శకాలు, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను మరింత సులభంగా, కచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారనానరు. యశోధ హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన గర్భధారణలో విజయవంతంగా తల్లీబిడ్డలను క్షేమంగా కాపాడడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భధారణలో రుమటలాజికల్, ఎండోక్రైన్ రుగ్మతలు, ప్రసూతి సమయంలో అత్యవసరపరిస్థితులు, గుండె సమస్యలు తదితర అంశాలపై తల్లీబిడ్డలను సురక్షితంగా ఎలా కాపాడాలో సెషన్‌లను నిర్వహించినట్లు తెలిపారు.

మోదీ పాలనలోనే దేశం పురోగతి

11 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్లు

- కార్యశాలలో బీజేపీ నాయకుల వెల్లడి

తాండూరు టౌన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని పాలన అందిస్తున్నారని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. మోదీ ప్రధానిగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం తాండూరులో పార్టీ నాయకులు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సుమారు ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి పనులను ప్రధానిగా మోదీ కేవలం దశాబ్దంలో పూర్తి చేసిందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, రామ్‌మందిర నిర్మాణం, సీఏఏ, ట్రిపుల్ తలాక్, వక్ఫ్‌బోర్డు చట్టం, గరీబ్ కల్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఆర్థిక రంగంలో ప్రపంచంలోనే దేశాన్ని నాలుగో స్థానంలో నిలపడం, మావోయిస్టులు, ఇతర ఉగ్రవాదుల ఏరివేత, క్రీడా, వ్యవసాయ, దేశ రక్షణ రంగం వంటి వాటిలో ఎంతో పురోగతి చెందిందన్నారు. మేకిన్ ఇండియా నినాదంతో దేశ ప్రగతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత మోదీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, ధార్మిక సెల్ జిల్లా నాయకుడు మోహన్ రెడ్డి, నాయకులు రాజు, శృతి, శ్రీనివాస్, షాబుద్దీన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


రాధిక (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీకి చెందిన యాదగిరి కుమార్తె రాధిక(24) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఈ నెల 6న ఉదయం 8 గంటలకు పాఠశాలకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వివాహిత..

మణికొండ: వివాహిత అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేర కు... సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండీకి చెందిన శ్రీరామ్ యోగిబాబు, తన భార్య సుచరిత(21)తో కలిసి శనివారం మధ్యాహ్నం ఫైనాన్షియల్ జిల్లాలో ఉన్న ప్రిస్టేజ్ స్కైటెక్‌లోని ఆమె కార్యాలయానికి వచ్చారు. అందులో ఆమె ఫ్లోర్ మేనేజర్‌గా పనిచేస్తుంది. తనకు లోపల పని ఉందంటూ భర్తను బయట ఉంచి లోనికి వెళ్లింది. ఎంత సేపు వేచి చూసినా ఆమె రాకపోవటంతో లోనికి వెళ్లి చూడగా ఆమె అక్కడ కనిపించలేదు. పరిసర ప్రాంతాలతో పాటు బంధుమిత్రుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె మెరూన్ రంగు దుస్తులు ధరించిందని, చేతికి స్మార్ట్ వాచ్ ఉందని, ఆమె ఆచూకీ తెలిస్తే నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

జంట హత్యల కేసు దర్యాప్తునకు బృందం

మొత్తం ఏడు టీంల ఏర్పాటు

రాజేంద్రనగర్: జంట హత్యల కేసు ఛేదించేందుకు రాజేంద్రనగర్ పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిందితుల ఆనవాళ్లు లభించక పోవడంతో దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. హత్య కేసును ఛేదించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఆదివారం మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధ దంపతుల కుటుంబ సభ్యులను ఆదివారం మరోసారి ప్రశ్నించి వివరాలను సేకరించారు. ఆస్తి వివాదాలు, డబ్బు, నగలు తదితర వాటిపై కుటుంబ సభ్యుల నుంచి పలు ప్రశ్నలు అడిగి సమాచారం సేకరించారు. సీసీ టీవీ పుటేజీల్లో లభించిన ఆధారంగా నిందితుల చిత్రాలను కుటుంబ సభ్యులతో పాటు బంధువు, మిత్రులకు చూపించినా ఎలాంటి క్లూ లభించలేదు. దీంతో నిందితుల చిత్రాలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులు వాడిన రెండు ద్విచక్ర వాహనాలు నంబర్ ప్లేట్లు మార్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఒక వాహనం లభించినా ఎలాంటి క్లూ లభించలేదని సమాచారం. పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి క్లూ లభించలేదంటూనే... త్వరలో నిందితులను పట్టుకుంటామని వెల్లడిస్తున్నారు.